
హైదరాబాద్ వార్త



# జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో రీఎంట్రీకి తెలుగుదేశం తహతహ!

**-అధినేత ఆదేశాలతో గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్న నేతలు**
**-అమెరికా తానా సభల్లో కూడా ఇదే హాట్ టాపిక్**
**-ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీ చేయాలని ధృఢసంకల్పంతో ఉన్న చంద్రబాబు**
**-నందమూరి సుహాసిని అభ్యర్థిగా ప్రకటించే అవకాశం**
**-పోటీకి మరో ఎన్నారై కూడా అత్యుత్సాహం**

**పంజగుట్ట, జూలై 2 (ప్రభాతవార్త):** తెలంగాణాలో తెలుగుదేశం రీ ఎంట్రీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఒక అవకాశంగా తీసుకోవాలని అధినేత చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారని సమాచారం. దీనిలో భాగంగానే మాగంటి గోపీనాథ్ మృతి చెందిన తర్వాత చంద్రబబాబు చురుకుగా పావులు కదిపినట్లు సమాచారం. నగరానికి చెందిన ఓ సీనియర్ నేతకు జూబ్లీహిల్స్ గ్రౌండ్ రియాలిటీ తెలుసుకునే బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ సెటిలర్స్ అందులోనూ కమ్మ, కాపు వర్గాలకు చెందిన ఓటర్లు ఎక్కువగా ఉండడంతో బలమైన అభ్యర్థిని నిలబెడితే విజయావకాశాలు ఉంటాయనే ఆశాభాన్ని కూడా తెలంగాణా నేతలతో చంద్రబాబు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏపీ తరహాలోనే ఇక్కడ కూడా తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థికి విజయావకాశాలు ఉన్నాయని చంద్రబాబు చేయించిన అంతర్గత సర్వేలలో తేలినట్లు సమాచారం. దీంతో చంద్రబాబునాయుడు బీజేపీ పెద్దలతో మాట్లాడడానికి ఓ బృందాన్ని కూడా ఢిల్లీకి పంపాలనే యోచనలో కూడా ఉన్నారని తెలిసింది. గత ఎన్నికలలో ఇక్కడ పోటీచేసిన బీజేపీ పెద్దగా ప్రభావాన్ని చూపలేకపోయింది. దీంతో బీజేపీని ఒప్పించి ఇక్కడ కూటమి అభ్యర్థిగా తెలుగుదేశం తెలంగాణ ఉపాధ్యక్షురాలు, నందమూరి హరిక్రిష్ణ కుమార్తె నందమూరి సుహాసిని అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు విస్వసనీయ సమాచారం. ఈ విషయమై అమెరికా తానా సభల్లో పలువురు తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్ళిన వారు పార్టీలకతీతంగా చర్చించుకోవడంతో పాటు సుహాసిని అభ్యర్థిత్వాన్ని బలపరచాలని ఆ సామాజిక వర్గ నేతలు బలంగా తీర్మానించుకున్నట్లు సమాచారమందుతోంది. అంతేకాకుండా చంద్రబాబునాయుడు కూడా ఏపీ ముఖ్యమంత్రిగా ఉండి తరచుగా వీకెండ్స్‌లో హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ఈ సమయంలో తెలంగాణాలో తెలుగుదేశం రీ ఎంట్రీకి సంబంధించి పలురకాలుగా వ్యూహాలు చేశారు. అనుకోకుండా మాగంటి మృతి చెందడంతో పాటు తెలుగుదేశం క్యాడర్ కూడా జూబ్లీహిల్స్‌లో బలంగా ఉండడంతో ఇక్కడ నుంచే రీఎంట్రీతో సత్తా చాటాలనే నిర్ణయానికి వచ్చారని సమాచారం. అయితే అభ్యర్థి విషయంలో గత వారం నుండి మల్లగుల్లాలు పడి చివరకు నందమూరి సుహాసిని అభ్యర్థిత్వం వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. సుహాసిని గత ఎన్నికల్లో కూకట్‌పల్లి నుండి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుండి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గానే పాల్గొంటున్నారు. దీంతో గత రెండు రోజులుగా నియోజకవర్గంలో టీడీపీ క్యాడర్‌తో బాధ్యతలు అప్పగించిన సీనియర్ నేత మంతనాలు సాగిస్తున్నారు. అయితే మరో ఎన్నారై కూడా జూబ్లీహిల్స్ నుండి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. తానా సభలకు వెళ్ళిన ఓ సీనియర్ నేతతో ఆ ఎన్నారై సీరియస్‌గా తన అభిలాషను వ్యక్తం చేయడమే కాకుండా తనకు టికెట్ కేటాయిస్తే గెలుపు అవకాశాలు ఏ విధంగా ఉంటాయో కూడా వివరించినట్లు సమాచారం. ఆ ఎన్నారై కూడా చంద్రబాబు సామాజిక వర్గానికి చెందినవారు కావడం విశేషం. మరి కొద్ది రోజుల్లోనే తెలుగుదేశం పోటీ విషయం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ టీడీపీ సీనియర్ నేత ఒకరు అంతర్గత సంభాషణలలో వెల్లడించారు.

# సఖి కేంద్రాల్లో మహిళా బాధితులకు సత్వర న్యాయం జరగాలి

**-మహిళల హక్కులు, చట్టాలపై వారికి అవగాహన కల్పించాలి**
**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**



సికింద్రాబాద్‌లోని సఖీకేంద్రం సందర్శించిన కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త:** జిల్లాలో సఖి కేంద్రానికి వచ్చే బాధిత మహిళలు, బాలికలకు భరోసాతోపాటు సత్వర న్యాయం అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశించారు. హైదరాబాద్ పెద్ద జిల్లా కావడంతో జిల్లాలో మహిళా హక్కులు చట్టాలపై శిబిరాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే తాత్కాలిక ఆశ్రయం, కౌన్సిలింగ్, పోలీసుల సహాయం, వైద్య సహాయం, లీగల్ డిఐఆర్ , కౌన్సిలింగ్, రెస్క్యూ సర్వీసు తప్పక అందాలన్నారు. ఈమేరకు బుధవారం సికింద్రాబాద్ లోని సఖి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత మహిళల పట్ల అండగా నిలవాలని అలాగే అందించే నష్టపరిహారంలో కూడా పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. బస్టాండ్స్, రైల్వే స్టేషన్స్ లలో భిక్షాటన, తప్పి వచ్చిన పిల్లలను గుర్తించి సత్వర చర్యలతో పాటు రక్షణ కల్పించి తల్లిదండ్రులకు లేదా కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆమె సూచించారు. అలాగే బంజారాహిల్స్ లో నిర్మాణంలో ఉన్న సఖి సెంటర్ పనుల వివరాలను, అలాగే చార్మినార్ ప్రాంతంలో సఖి కేంద్రం నిర్మాణానికి అనువుగా ఉన్న స్థలానికి సంబంధించిన వివరాలను కూడా తెలుసుకున్నారుఇప్పటి వరకు 6080 కేసులు చేపట్టమని అలాగే 17095 మంది మహిళా బాధితులకు వివిధ రకాల సేవలను అందించామని ఈసందర్భంగా సిబ్బంది వివరించారు. కేసులకు సంబంధించిన విషయాలలో బాధిత మహిళలకు కోర్టు సూచనలు మేరకు జూన్ మాసం నాటికి రూ. 17 కోట్ల 71 లక్షలకు పైగా చెల్లించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి అక్కేశ్వరరావు, దివ్య దిశ ఎన్జీవో నిర్వహకులు ఫిలిప్స్, సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ అనిత రెడ్డి, కౌన్సిలింగ్ ఇచ్చే సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాన్సూన్ టీంలు 24గంటలు అప్రమత్తంగా ఉండాలి

**-వాతావరణశాఖ హెచ్చరికలకు అనుగుణంగా సిద్ధం కావాలి**
**-అధికారులు, సిబ్బందికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశం**



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, జులై 2,ప్రభాతవార్త:** వర్షాకాలం పని చేసే మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్(ఎంఈటీ)లు 24గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. వాతావరణ హెచ్చరికలను క్షుణ్ణంగా పరిశీలించి.. వర్షానికి ముందే సన్నద్ధమవ్వాలన్నారు. జులై 1వ తేదీ నుంచి రంగంలోకి దిగిన మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ల కాంట్రాక్టర్లతో పాటు.. హైడ్రా మార్షల్స్, డీఆర్ ఎఫ్ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రంగనాథ్ మాట్లాడారు. వర్షం పడితే తలెత్తే సమస్యలపై పూర్తి అవగాహనతో ఉండాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తుతుందో.. అందుకు పరిష్కారం ఏంటో కూడా తెలియాలన్నారు. వర్షం పడినప్పుడు అప్రమత్తంగా ఉండి. రహదారులను, నివాసాలను వరద ముంచెత్తకుండా జాగ్ర త్త పడాలన్నారు. వర్షం లేనప్పుడు సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు.

### ప్రజాసమస్యలపై పరిధులు వద్దు..

వర్షాకాలం ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసే బాధ్యతను హైడ్రాపై నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని.. అది వమ్ము కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని రంగనాథ్ సూచించారు. ప్రజల విశ్వాసం చూరగొనేలా పని విదానం ఉండాలన్నారు. ప్రజలు సమస్యల్లో ఉంటే పరిధిలు గీసుకొని ఉండాల్సిన పని లేదని.. పక్క సర్కిల్‌లో సమస్య ఉంటే వెంటనే అందరూ చేతులు కలపాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జీహెచ్ ఎంసీ, జలమండలి, హైడ్రా, ఇరిగేషన్ ఇలా సంబంధిత శాఖలన్నిటితో అధికారులు సమన్వయం ఏర్పాటు చేసి.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడమే లక్ష్యం కావాలన్నారు. వాహనాలు మొరాయించడం, నీటిని తోడే పంపులు పని చేయడంలేదు ఇలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్త పడాలని ఎవరికైనా ఇబ్బంది ఉంటే.. వెంటనే సంబంధిత అధికారి దృష్టికి తీసుకువస్తే ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాలు ఫిర్యాదు చేసినప్పుడు వాటి పరిష్కారానికి ఎంతో బాధ్యత పడాలన్నారు.

## సూరారంలో కారు భీభత్సం

**జీడిమెట్ల, జులై 2, ప్రభాతవార్త**

సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఓ కారు భీభత్సం సృష్టించింది. అతి వేగంగా దూసుకువచ్చిన ఇన్నోవ కారు (టిఎస్ 08 జెఎస్ 6336) అదుపుతప్పి కట్ట మైసమ్మ చెరువు మూలమలుపు వద్ద చెరువులోకి దూసుకెళ్ళింది. దీంతో బతుకమ్మ పాండ్‌కు వేసిన ఇనుప కంచె ధ్వంసం అయ్యింది. కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు అక్కడి నుండి పారారయ్యారు. స్థానికంగా ఉండే నాయకులు గుట్టు చప్పుడు కాకుండా క్రేన్ సహాయంతో హుటాహుటిన కారును చెరువులో నుండి తీసి, కారు నెంబర్ ప్లేటును తొలగించి అక్కడి నుండి తరలించారు. అయితే ఆ కారు స్థానికంగా ఉండే ఓ వ్యాపారావేత్తదని పోలీసులు అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


# రోజంతా ..ముసురు

**-నగరాన్ని కమ్మేసిన చిరుజల్లులు**
**-ఉద్యోగులు,చిరువ్యాపారులకు తప్పని తిప్పలు**



**హైదరాబాద్,జూలై 2,ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం రాష్ట్ర రాజధానిలో తీవ్రంగా కనిపించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు హైదరా బాద్ నగరాన్ని ముసురు కమ్మేసింది. చిరుజల్లులు, వానతో వర్షాకాలం నాటి వాతావరణం కనిపించింది..వర్షానికి వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని బేగంబ జార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హి మాయత్ నగర్, నారాయణ గూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. సికింద్రా బాద్ బోయిన్ పల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం ప్యారడైజ్ చిలకల గూడ బేగంపేట ప్రాంతాలలో వర్షం కురుస్తు పలుచోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కాలనీలలో వర్షపు నీటితో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో హైదరాబాద్‌లో రాత్రిళ్ల చలితీవ్రత పెరుగుతుంది.. మరో రెండు రోజుల పాటు చిరుజల్లులు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

### నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు : మేయర్ విజయలక్ష్మి



**పంజగుట్ట,జూలై2 (ప్రభాతవార్త):** నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. బుధవారం జోనల్, సర్కిల్ స్థాయి అధికా రులతో కలిసి బంజారా డివిజన్ బంజారా లేక్‌లో ఉన్న గుర్రపు డెక్కతో పాటు ఇతర వ్యర్థాలను తొలగించే ప్రక్రియను పరిశీలించారు.ఎఎల్ఓ కార్యక్రమంలో భాగంగా ఎఫ్‌టీసీ మిషన్‌తో పాటు డ్రోన్‌తో దోమల నివారణకు చేపట్టే పిచికారిని మేయర్ ప్రారంబభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలంలో నగరవాసులకు డెంగ్యూ మలేరియా, చకెన్‌గున్యా తదితర అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు కీటకనాశిని నివారణకువిస్తృతతంగా అవగాహన కార్యక్రమాలతో పాటు ఎఎల్ఓ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాకాల ముందస్తు శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు వార్డు వారీగా తీసుకుని ఒక్కో వార్డులో నాలుగు దఫాలుగా ఫాగింగ్, శానిటేషన్ డ్రైవ్‌ను ముమ్మరంగా చేపట్టినట్లు వివరించారు. డెంగ్యూ ప్రబలిన ఇంటితో పాటు చుట్టూ ఉన్న గృహాలకు డెంగ్యూ వ్యాధికి గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నగరవాసులు కూడా తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,నీటి నిలువలు ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం

**-భక్తులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని -వైభవంగా రథోత్సవ కార్యక్రమం**



బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద సమావేశమైన ఎమ్మెల్యే తలసాని



బంగారు భోనాన్ని అమ్మవారికి సమర్పిస్తున్న జోగినీలు

**సంజీవరెడ్డి నగర్, జూలై 2 ప్రభాతవార్త:** బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణం వైభవంగా, ప్రశాంతంగా జరిగిందని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమె ్మల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారి దర్శనం కోసం క్యూ లైన్లలో ఉన్న భక్తులతో మాట్లాడారు. మంగళవారం నాడు జరిగిన కళ్యాణం తిరు, ఎదురైన ఇబ్బందుల గురించి అధికారులు, భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కళ్యాణం ఏర్పాట్లలో భాగస్వాములైన దేవదాయ శాఖ, పోలీస్, జిహెచ్ఎంసి, ఎలక్ట్రికల్, ట్రాఫిక్, హెల్త్, వాటర్ వర్క్స్, తదితర శాఖల అధికారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, వా లెంటీర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అభినందనలు తెలిపారు. మంగళవారం రాత్రి అరగంట పాటు ఆలయ పరిసరాల్లో విద్యుత్ సరఫర నిలిచిపోగా అధికారులు సకాలంలో స్పందించకపోవడం వలన భక్తులు కొందరు ఇబ్బందులకు గురైనట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. అదే విధంగా లక్షలాది మంది భక్తులకు భోజనం అందించేందుకు స్వచ్ఛందంగా దాతలు పెద్ద మనుషతో అన్నదాన శిబిరాలను ఏర్పాట్లు చేసినప్పటికి సరైన సౌకర్యాలు కల్పించకపోవడం వలన తాము ఇబ్బందులు పడాల్సివచ్చిందని పలువురు నిర్వాహకులు తెలిపారని ఆయన అన్నారు. ఇదే కాకుండా పలు ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. గతంతోపోల్చుకుంటే ఈ సంవత్సరం భక్తుల సంఖ్య కూడా తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈఓ హేందర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావ్, సీనియర్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, గోపీలాల్ చౌహాన్,కూతురు నర్సింహ్మా, కట్ట బలరామ్,శ్రీనివాస్ యాదవ్, వనం శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, బాబా గౌడ్, పీయూస్ గుప్తా, హరిసింగ్ జాదవ్, సచిన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగా రథోత్సవ కార్యక్రమం**

బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో భాగంగా చివరి రోజు రథోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా దేవదాయ శాఖ అధికారులు, ఆలయ ఈఓ మహేందర్ గౌడ్, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, జోనల్ ఆఫీసర్, అన్నపూర్ణ, సూపరిండెంట్ హైమావతి, ఆలయ సిబ్బంది నిర్వహించారు.అమ్మవారి రథోత్సవాన్ని ఎంతో సుందరంగా అలంకరించిన రథోత్సవాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, సనత్ నగర్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమా, పలువురు కలిసి ప్రారంబించారు. ఈ రథోత్సవంలో వేలాది మంది భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలో పాల్గొన్నారు. అదే విధంగా అమ్మవారికి జోగినీలు బంగారు బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు.

# రుతుపవనాల సంసిద్ధతపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి


**-దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్**



సమావేశంలో సూచనలు అందజేస్తున్న జీఎం సందీప్ మాథుర్

**తార్నాక, జులై 2 ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ బుధవారం రుతుపవనా ల దృష్ట్యా జోన్ వ్యాప్తంగా చేపడుతున్న రుతుపవనాల సంసిద్ధత, భద్రతా చర్యలపై సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్, ప్రధాన విభాగాధిపతులు పాల్గొన్నారు.విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్‌లలోని ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు, డిఆర్ఎం, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్లు మరియు డివిజనల్ ఇంజనీర్లు, ఏడిఆర్ఎం లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ సమీక్షా సమావేశంలో వంతెనలు, సొరంగాలు వంటి గుర్తించబడిన కీలక విభాగాలలో చేపట్టిన భద్రతా చర్యలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు అత్యవసర పరికరాల లభ్యత, ఇసుక, రాళ్ళు, పైపులు వంటి అవసరమైన వస్తువుల నిల్వలను ఆయన సమీక్షించారు. ప్రమాదానికి గురయ్యే ప్రాంతాలు, వంతెనలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఎల్లప్పుడు పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఏవైనా మరమ్మతు పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆయన సూచించారు. నీటి వరదకు గురయ్యే అవకాశం ఉన్న రోడ్ అండర్ బ్రిడ్జిల వద్ద ముందస్తు చర్యలలో భాగంగా చేపట్టిన భద్రతా చర్యలను జనరల్ మేనేజర్ సమీక్షించారు. లిఫ్టింగ్ బారియర్, డ్రైనేజీ పనులు, హెచ్చరిక బోర్డు ఏర్పాటు, నీటి పంపింగ్ ఏర్పాట్లు, ఎల్లప్పుడు వాచ్‌మెన్ నిఘా వంటి జాగ్రత్తలను ఆయన పరిశీలించారు. సురక్షితమైన పని విధానాన్ని ఖచ్చితంగా పాటించాలని, రైలు కార్యకలాపాలకు సంబంధించిన రికార్డు లను సక్రమంగా సరైన విధానంలో నిర్వహించాలని, అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలను చేపట్టాలని ఆయన అధికారులు, సిబ్బందికి సూచించారు.సూపర్ వైజర్ లు క్షేత్ర స్థాయిలో జరిగే కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని, ఏదైనా సమస్య ఉత్పన్నమైనచో తక్షణమే పరిష్కరించాలని జనరల్ మేనేజర్ పేర్కొన్నారు. సమూహ సమావేశాలు, వ్యక్తిగత కౌన్సెలింగ్ సెషన్‌ల ద్వారా భద్రతకు సంబంధించిన సిబ్బందిని క్రమం తప్పకుండా అప్రమత్తం చేయాలని కూడా ఆయన అధికారులకు సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలు కల్పించాలి : కిషన్ రెడ్డి



శ్రీరామ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ క్లీనింగ్ మిషన్స్‌ను పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**యూసుఫ్‌గూడ, జూలై 2, ప్రభాతవార్త :** కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే భాత్యత ప్రభుత్వంపై ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ రామ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ క్లినింగ్ మిషన్‌లను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదువుకునే విధంగా ఉపాధ్యాయులు అధికారులు ఎప్పటికపుడు వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మౌళిక సదుపాయాలు కల్పించడంలో వచ్చే బడ్జెట్ తగ్గిపోవడం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలల్లో శానిటేషన్ సమస్యలు ఉన్నాయని శుభ్రత, పరిశుభ్రత సమస్యలు తలెత్తకుండా తగిన విధంగా పరిసరాలను పరిశభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా శానిటేషన్ నిర్వాహణ కోసం ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమయిన సిబ్బందిని నియమించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. శ్రీ రామ్‌నగర్ పాఠశాలకు అవసరమయిన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని అవసరమయిన టాయిలెట్ క్లీనింగ్ మిషన్‌లను అందివ్వడం జరిగిందన్నారు. తమ ఎంపీ నిధులను కలెక్టర్ కార్యాలయానికి అందజేస్తామని అవసరమయిన స్కూల్‌లో బ్లాక్ బోర్డుల ఏర్పాటుకు మంజూరు చేస్తామన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అధికారులు, ప్రజా ప్రతినిధులు రెవెన్యూ సిబ్బంది ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ఉత్తమంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజేపి అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి, కొలన్ సత్యనారాయణ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## 34కేజీల గంజాయి పట్టివేత



**అడ్డగుట్ట, జులై2,ప్రభాతవార్త** హైదరాబాద్ నగరంలో ఒక వ్యక్తికి గంజాయిని ఇచ్చేందుకు వచ్చిన భువనేశ్వర్ నుంచి వచ్చి జేబీఎస్‌లో గంజాయి ప్యాకెట్లతో ఎదురు చూస్తున్న ఇద్దరు నిందితులను డీటీఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేసి వారి నుంచి 34కిలోల గంజాయిని పట్టుకున్నారు.దీని విలువ రూ 17లక్షలు ఉంటుందని అధికారులు తెలియజేసారు.సికింద్రాబాద్ ఏఈఎస్ శ్రీనివాస్‌రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బీహార్‌కు చెందిన ఏ.రమేష్‌కుమార్, ఏ.చందన్‌కుమార్‌లు ఇద్దరు మూడు బ్యాగులలో 17 గంజాయి ప్యాకెట్లను తీసుకుని భువనేశ్వర్ నుంచి రైలులో ప్రయాణించి నగరానికి చేరుకున్నారు. వారు తీసుకు వచ్చిన 17గంజాయి ప్యాకెట్లను జేబీఎస్ లో ఒక వ్యక్తికి అందజేసేందుకు ఎదురు చూస్తుండగా సమాచారం అందుకుని వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 34కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.గంజాయిని వారుఎవరికి అందజేసేందుకు తీసుకు వచ్చారు అనే విషయాన్ని ఆరా తీస్తున్నామన్నారు.నిందితులను వారి వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయిని సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో డీటీఎఫ్ సీఐ సావిత్రి సౌజన్య ,సత్యనారాయణ, ఖలీల్,రవి, శిల్పా,పరమేష్‌లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ షానవాజ్ ఖాసీంతో పాటు హైదరాబాద్ ఇంచార్జి డీసీ అనిల్‌కుమార్ రెడ్డిలు అభినందించారు.

## ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి


రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో సమావేశం అయినా టిఎన్జిఒ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, మార్కెట్ కమిటీ సెంట్రల్ ఫోరమ్ అధ్యక్షులు చిలక నరసింహారెడ్డి తదితరులు

**మలక్ పేట ,జూలై 2 ,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని టిఎన్జీవోఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ , ప్రధాన కార్యదర్శి ముజిబ్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షులు చిలక నరసింహారెడ్డి, కార్యదర్శి ముక్రంలు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును వారు మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటవ తేదీన జీతాలు, పెన్షన్లు ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా మార్కెట్లలో వివిధ హోదాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేసి కమిటీ ఉద్యోగులకు పని భారం తగ్గించవలసిందిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కోరారు.

## సమ్మె జయప్రదం చేయాలి : సిఐటియు



**అబ్దుల్లాపూర్ మెట్, జులై 2, ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్ మెట్టు మండలం మెడికల్ ఆఫీసర్ ప్రసన్న లక్ష్మికి సిఐటియు ఆధ్వర్యంలో జూలై 9 నా జరిగే సమ్మె జయప్రదం చేయాలని సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. సిఐటియు ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్ మండల కమిటీ, ఆశా వర్కర్ల తో మెడికల్ ఆఫీసర్ కి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ, జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, ప్రధానంగా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, కార్మికులు పోరాడి తెచ్చుకున్న 29 చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక లేబర్ కోర్డు తీసుకొచ్చి, కార్మికులకి ఎటువంటి హక్కులు లేకుండా, చేస్తుంది. కార్మికులు ప్రాణ త్యాగం చేసి 8 గంటల పని దినాలు సాధించుకుంటే 8 గంటల పని దినాలు తీసివేసి 12 గంటలు చేయాలని, కలిసి వేతనాలు అమలు చేయకుండా కార్మికులు అడిగే హక్కు లేకుండా, బిజెపి ప్రభుత్వం, తీసుకొస్తుంది, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నాలుగు లేబర్ కోడ్లను ఎత్తివేసి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి, కనీస వేతనాలు అమలు చేయాలని, కోరుతూ ఈనెల తొమ్మిదిన దేశవ్యాప్తంగా అన్ని రంగాల కార్మికులు, పారిశ్రామిక కార్మికులందరూ సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని, కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటి మండల నాయకులు ఎలకపల్లి మహేష్,, ఆశ వర్కర్లు, రమాదేవి, యమునా, స్వరాజ్యం, , సుహాసిని, జ్యోష్ణ పాల్గొన్నారు.


## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి: ఏఐటీయూసీ


గోడ పత్రికను విడుదల చేస్తున్న నాయకులు

**హయత్ నగర్, జులై 2 ప్రభాతవార్త :** కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల తొమ్మిదిన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో రావినారాయణరెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం గోడ పత్రికను విడుదల చేశారు, ఈసందర్బంగా వారు మాట్లాడుతూ... కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్, అప్రెంటిస్, థర్డ్ పార్టీ, ట్రైనీలుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, 26 వేల కనీసవేతనం అమలు చేయాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించే చట్టం చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించి సంవత్సరానికి 200 రోజుల పని రోజులకు 600 వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ మండల కార్యదర్శి హరిసింగ్ నాయక్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేతరాజు నర్సింహా, మండల అధ్యక్షులు దాసరి ప్రసాద్, మండల నాయకులు యేశాల నర్సింహా, నవనీత, అరుణ, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు నిర్మించండి

**- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ని కోరిన వినాయక నగర్ కాలనీ వాసులు**


గౌతమీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న అరవింద్ రెడ్డి

**నేరెడ్ మెట్, జులై 2, ప్రభాతవార్త :** వినాయక్ నగర్ డివిజన్ ప్రజల సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వినాయక్ నగర్ రోడ్ నెంబర్ 8 కాలనీవాసులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో కలిసి తమ గోడును వినిపించుకున్నారు వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ రోడ్ నెంబర్ 8 కు చెందిన స్థానికులు గౌరవ యం ఎల్ ఎ మర్రి రాజశేఖర్ రెడ్డి గారిని కలిసిసి సి రోడ్ నిర్మాణం చేయించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.వెంటనే స్పందించిన యం ఎల్ ఎ సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్ నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తులసి సురేష్,ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గుప్తతో పాటు స్థానికులు రిచర్డ్,అభిషేక్,లింగమూర్తి,శ్రీనివాస్,రాణి,అనురాధ, లక్ష్మీ భాయి,విజయ,అంజమ్మ,మానస,దేవి పాల్గొన్నారు.

## 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి : జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్



**తుర్కయంజాల్, జూలై 2 ,ప్రభాతవార్త :** జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనీ విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులకు సమ్మె కరపత్రాలు అందజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్ ల జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపుమేరకు జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనీ విజయవంతం చేయాలని అన్నారు. శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలలోని 24 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్ట వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్ ల అమలును తక్షణమే రద్దు చేయాలని, స్థానిక సంస్థలకు నిధులు కేటాయించి మున్సిపాలిటీలను బలోపేతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఇ. మహేష్, ఏ. రవి, ఎం సుధాకర్, ఎన్. వెంకటేష్, సిహెచ్ అంజయ్య, జె సరిత, ఎస్ నరేష్, కే మంజుల తదితరులు పాల్గొన్నారు.

## దిల్‌షుక్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలకు బస్సు సౌకర్యం

**- దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సమత**

**మలక్ పేట ,జూలై 2, ప్రభాతవార్త:** దిల్‌షుక్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు నిహార యాత్రలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్టీసీ డిపో మేనేజర్ సమత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దిల్ షుక్ నగర్ సిటీ డిపో నుంచి మరల ఇంకొక విహారయాత్ర చేయడానికి బస్సు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వరంగల్, కొమరవెల్లి, కొండపోచమ్మ, వేములవాడ యాత్ర చేయడం కోసం ఈనెల 5వ తేదీ శనివారం దిల్ షుక్ నగర్ సిటీ డిపో నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 7 గంటలకు మరల యాత్ర పూర్తి చేసుకుని రావడం జరుగుతుందని వివరించారు. యాత్ర కోసం 40 మంది కెపాసిటీ గల మెట్రో డీలక్స్ బస్సును ఏర్పాటు చేయడం జరిగిందని, పెద్దలకు ఒక్కొక్కరికి రూ. 1000 రూపాయలు, పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 500 మాత్రమేనని తెలిపారు. యాత్రకు వెళ్ళడం కోసం టికెట్లను ముందుగా కూడా బుకింగ్ చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కాలనీవాసులు, స్కూలు విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు విహారయాత్ర వెళ్ళడానికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల వారు దిల్ షుక్ నగర్ సిటీ డిపో లోని ఫోన్ నెంబర్లు 7989928321 బుచ్చిరెడ్డి, 9063102132 ఎమ్మెస్ రెడ్డిలను సంప్రదించాలని పేర్కొన్నారు. బుకింగ్ లు ప్రారంభం అవడం జరిగిందని, వెంటనే ప్రజలు టీకేట్లను బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు. యాత్రను జయప్రదం చేయడం కోసం డిపో ఉద్యోగులు, సిబ్బంది అందరూ సహకరించాలని ఆమె పేర్కొన్నారు.

## బహిరంగ సభకు భారీగా తరలిరావాలి : కోట్ల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, జూలై 2 ప్రభాతవార్త:** ఈ నెల 4వ తేదీన ఎల్‌బి స్టేడియంలో జరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సైదాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం గత 18 నెలల నుంచి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. గత బిఆర్ఎస్ పాలకుల వల్ల అప్పుల కుప్పగా మారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం, గృహలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉద్యోగాల కల్పనకు జాబ్ క్యాలెండర్, గురుకుల విద్యార్థులకు హెల్త్ కార్డులు వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన ప్రజా ప్రభుత్వంగా మారిందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఈ నెల 4వ తేదీన ఎల్‌బిస్టేడియంలో జరిగే బహిరంగ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోట్ల శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగరిగారి దాస్, ఘని భాయి, కోట్ల లడ్డు పటేల్, శక్తినాయక్, రమేష్ నాయక్, ఫిరోజ్ ఖాన్, ఇస్మాయిల్, కార్తీక్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలో ఎంపి అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఫోటో లేకపోవడంపై విమర్శలు




చేవెళ్ల పార్లమెంట్ ప్రిపరేటరీ సమావేశంలో కనిపించని కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఫోటో

**సరూర్‌నగర్, జూలై 2 ప్రభాతవార్త:** చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలో మంగళవారం జరిగిన చేవెళ్ళ పార్లమెంట్ ప్రిపరేటరీ సమావేశంలో వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్ లో చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ కాంటెస్టెడ్ ఎంపి, మాజీ పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి ఫోటో లేకపోవడంపై విమర్శలు వచ్చాయి. జూలై నాలుగవ తేదీన నగరంలోని ఎల్‌బి స్టేడియంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యే జై భీమ్ జై బాపు జై సంవిధాన్ బహిరంగ సభను విజయంతం చేసేందుకు మహేశ్వరం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని తుక్కుగూడలోనున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే, అసెంబ్లీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ళ పార్లమెంట్ ప్రిపరేటరీ పేరిట సమావేశం ఏర్పాటు చేశారు. అయితే సమావేశం జరుగుతున్న వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్‌లో చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీ చేసిన గడ్డం రంజిత్‌రెడ్డి ఫోటో లేకపోవడంపై సమావేశానికి హాజరైన వారిలో పార్టీ శ్రేణుల్లో చాలా మంది ముక్కున వేలేసుకున్నారు. కెవిఎల్ఆర్ ఆహ్వానిస్తున్నట్లుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్‌లో సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్, ఎఐసిసి పరిశీలకురాలు, తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, చేవెళ్ళ పార్లమెంట్ కాంగ్రెస్ పరిశీలకురాలు, నారాయణపేట్ ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికారెడ్డి, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, జిహెచ్ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరుల ఫోటోలు ఉన్నాయి. అయితే పార్టీలోనే కాకుండా ప్రజాప్రతినిధిగా ప్రజా జీవితంలో వివాద రహితునిగా, సౌమ్యునిగా సామాజిక సేవా దృక్పథం గల నాయకునిగా మంచి పేరు ఉన్న చేవెళ్ళ మాజీ ఎంపి, నిరుడు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి ఫోటో ఎక్కడా లేకపోవడంపై సమావేశానికి హాజరైన దిగువ శ్రేణి నాయకుల్లో చర్చ జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన అభ్యర్థి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంఛార్జిగా వ్యవహరిస్తున్నట్లే పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన వారు పార్లమెంట్ ఇంఛార్జిగా వ్యవహరించాల్సి ఉండగా కనీసం ఫ్లెక్సీలో ఆయన ఫోటోకు చోటివ్వకపోవడం విమర్శలకు దారి తీసింది.


## సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటాం

**నన-మల్లాపూర్ యూపీహెచ్‌సీ ఆశావర్కర్లు**


సమ్మె నోటీసును అందజేస్తున్న ఆశావర్కర్లు

**నాచారం, జులై 2 ప్రభాతవార్త :** ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మల్లాపూర్ యూపీహెచ్‌సి పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు పాల్గొనబోతున్నట్లు ప్రకటించారు.ఈ నేపథ్యంలో బుధవారం సమ్మె నోటీసును మల్లాపూర్ మెడికల్ ఆఫీసర్‌కు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు)నాయకురాలు లత మాట్లాడుతూ శతాబ్దాలుగా కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం, వాటి స్థానంలో యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం ఆందోళనకరం అని అన్నారు. ఈ కోడ్‌లు అమలైతే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టమవుతుందని, కార్మికుల ఐక్యత శక్తిని దెబ్బతీయడానికి, అలాగే ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దేశంలోని పరిస్థితులపై సమీక్ష తర్వాత, వివిధ కార్మిక సంఘాలు, స్వతంత్ర సమాఖ్యలు, అసోసియేషన్లు కలిసి జూలై 9వ తేదీన సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. మండల కేంద్రంలో జరగబోయే నిరసన ప్రదర్శనలో ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సమ్మె నోటీసు అందజేసిన సందర్భంగా మల్లాపూర్ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యతగా మొక్కలు నాటండి : శ్రీధర్‌రెడ్డి


ఏనుగు రాంరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కిసాన్ సంవాద్ సందర్భంగా మొక్కలు నాటిన తెలంగాణ బిజెపి కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 2 ప్రభాతవార్త:** సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని తెలంగాణ బిజెపి కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. కిసాన్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా బిజెపి కిసాన్‌మోర్చా ఎపిఎంసి కన్వీనర్, మాజీ ఎంపిటిసి ఏనుగు రాంరెడ్డి ఆధ్వర్యంలో నాదర్‌గుల్-కుర్మల్‌గూడలోని వ్యవసాయ క్షేత్రంలో అమ్మ పేరుతో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, రంగారెడ్డి జిల్లా రూరల్ బిజెపి మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనీ నేటి సమాజంలో కాలుష్య నివారణకు విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి శ్రేణులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటి ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి నాయకులు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, తర్రె మల్లేష్ యాదవ్, అంజయ్య యాదవ్, కార్పొరేషన్ బిజెపి మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, గూడెపు ఇంద్రసేన, భాగ్యనగర్ సొసైటీ డైరెక్టర్ తోట ప్రతాప్‌రెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ ఏనుగు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామోజీ శ్రీశైలంచారి, పార్టీ అధ్యక్షుడు రామిడి వీరకర్ణారెడ్డి, నాయకులు పాలుబాయి లక్ష్మణ్, మర్రి అంజిరెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, గూడూరు శేఖర్‌రెడ్డి, నిమ్మల రవికాంత్‌గౌడ్, ఏనుగు బుచ్చిరెడ్డి, ఏనుగు జంగారెడ్డి, తోట అమరేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ ముదిరాజ్, బంగారు సుమన్, లాలం బాలనర్సింహ యాదవ్, ఎడ్ల శ్రీశైలం ముదిరాజ్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

## గౌతమీ నగర్ లో పర్యటించిన అరవింద్ రెడ్డి



**వనస్థలిపురం జులై. 2.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ లోని గౌతమీ నగర్ లో కాలనీ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ విజ్ఞప్తి మేరకు బి.యన్.రెడ్డి.నగర్ బి.ఆర్.ఎస్.పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి బుధవారం కాలనీ ప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీలో ఉన్న సమస్యలు తీసుకున్నారు. ఎల్. బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళ్ళి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం కాలనీలో ఓపెన్ జిమ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసిన ప్రదేశాన్ని అరవింద్ రెడ్డి పరిశీలించారు ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కిషన్, నారాయణ రావు,రాజు,భాస్కర్ గౌడ్,సుకుమార్, సాయిబాబా, కరుణాకర్,కాలనీవాసులు రవీంద్రబాబు,నాగ మల్లేశ్వర రావు, శ్రీహరి రెడ్డి,గోపాల్,యాదయ్య, శర్మ తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవు

**కమిషనర్ అమరేందర్ రెడ్డి**



**తుర్కయంజాల్, జూలై 2 ప్రభాతవార్త :** ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం దెబ్బతింటుందని, ప్లాస్టిక్ వాడితే జరిమానాలు విధిస్తామని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ కె. అమరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని బేకరీలు, జనరల్ స్టోర్లు, ఇతర వ్యాపార సంస్థల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తున్న దుకాణదారులపై జరిమాణాలు విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం కఠినంగా అమలు చేస్తున్నామని, నిషేధిత ప్లాస్టిక్ ను వినియోగిస్తున్న వారిపై జరిమాణాలు, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ వాడటంతో మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత తుర్కయాంజల్ ను సాధించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని, ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ వినయ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వనస్థలిపురం లయన్స్ క్లబ్‌కు అవార్డులు


ఉత్తమ అవార్డులు అందుంటున్న దూరయ్య,మల్లికార్జున రావు తదితరులు.

**వనస్థలిపురం జులై 2.ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ,డిస్ట్రిక్ట్ 320 హెచ్ ఆధ్వర్యంలో నగరంలోని ఓ ఫంక్షన్ హాల్ లో లయన్స్ క్లబ్ సేవా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వనస్థలిపురం లయన్స్ క్లబ్ కు ఉత్తమ న్యూ క్లబ్ అధ్యక్షుడు గా,ఉత్తమ సేవా అవార్డులను లయన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మనోహర్ రెడ్డి చేతుల మీదుగా విట్టా దూరయ్య అందుకున్నారు.లయన్ అత్తు లూరి మల్లికార్జున రావు కు బెస్ట్ డిస్ట్రిక్ట్ అవార్డ్,లయన్ ఎస్.జె.ఎస్.నందకిషోర్ కు బెస్ట్ సెక్రెటరీ అవార్డులు అందుకున్నారు.ఈ సందర్భంగా అవార్డులు పొందిన వారు మాట్లాడుతూ క్లబ్ లో చేసిన సేవలకు గుర్తింపు గా అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ఉత్సాహం ఇచ్చిందని తెలిపారు.

## వాటర్ వర్క్స్ జిఎంను కలిసిన కార్పొరేటర్



**మల్కాజిగిరి జూలై2,ప్రభాతవార్త :** ఈరోజు సైనిక్ పూరి జలమండలి కార్యాలయంలో వాటర్ వర్క్స్ జిఎం సునీల్ కుమార్‌ని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్లో బీజేఆర్ నగర్ వసంతపురి కాలనీ ప్రశాంత్ నగర్ ఏరియాలలో కలుషిత నీరు సరఫరా పై తగిన చర్యలు తీసుకోవాలని వాటర్ ప్రెషర్ పెంచాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీజీఎం హర్షిత మేనేజర్ తేజస్విని నాయకులు బాబు సత్యనారాయణ సంపత్రావు కిషోర్ తదితరులు పాల్గొన్నారు

## ఖర్గే సభను విజయవంతం చేద్దాం

**మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్**

**బోడుప్పల్, జులై 2 ప్రభాతవార్త ;** హైదరాబాద్ జులై 4న ఎల్బీ స్టేడియంలో నిర్వహించబోతున్న బహిరంగ సభకు జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ లో భాగంగా అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరవుతున్నారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశానుసారం బోడుప్పల్లో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి ,జిల్లా ఇంఛార్జులు శశికళ యాదవ రెడ్డి , మిథున్ రెడ్డి ,గజ్జల కాంతం హాజరై నియోజకవర్గంలోని బ్లాక్,మున్సిపల్,కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు,మాజీ మేయర్లకు,మాజీ మున్సిపల్ చైర్మన్లకు,సీనియర్ నాయకులకు దిశ నిర్దేశం చేసి సభను విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్ ,అమర్ సింగ్ , మాజీ చైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ ,మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి , మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మక్ అజయ్ ,మాజీ కార్పొరేటర్ సుమన్ నాయక్ , మేడ్చల్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షులు జీడిపల్లి వేణుగోపాల్ రెడ్డి ,బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ , సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన


పుష్పార్చన లో పాల్గొన్న మహిళలు

**ఎల్‌బినగర్, జులై 2 ప్రభాతవార్త:** ఆర్కేపురంలోని కుర్తాల పీఠం శ్రీప్రత్యంగిరా దేవాలయంలో ఉత్తర పీఠాధిపతులు శ్రీదత్తేశ్వరానందభారతి మహాస్వామివారి సమక్షంలో జరుగుచున్న వారాహిదేవి నవరాత్రులలో భాగంగా గురువారం లక్షపుష్పార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంతలక్ష్మి ఆధ్వర్యంలో భక్తుల కోలాహలం మధ్య లలితా సహస్రనామ పారాయణము జరిగింది. ఈ సందర్భంగా ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ వారాహిదేవి నవరాత్రులలో ప్రతిరోజు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల నుండి 30వేల మంది భక్తులు దర్శించుకుంటున్నారని తెలిపారు. అమ్మ వారి సేవలు వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సువర్ణ లత, విజయలక్ష్మి, వర్ధని, ఆకెళ్ళ అనురాధ, హేమ, అరుణ, రాధ, సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ మాసం గోరింటాకు కార్యక్రమం


మైదాకు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

**ఎల్‌బినగర్, జులై 2 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ కార్యాలయంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ కాటా విజయగౌడ్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నాయకులు పెద్దఎత్తున పాల్గొని ఒకరికి ఒకరు మైదాకు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళ నాయకులు కొప్పెర శ్యామల, నూకల పద్మ రెడ్డి, పోరెడ్డి కవిత రెడ్డి, రాజేశ్వరి, రజిత, కొత్తపేట డివిజన్ బీజేపీ మహిళా నాయకులు వైజయంతి, లావణ్య, సంగీత, అరుణ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎవరు ఖాళీ చేయాల్సిన అవసరం లేదు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో బస్తీ వాసులు


**సైదాబాద్, జులై 2 ప్రభాతవార్త:** బైరామల్‌గూడ చెరువు సమీపంలో బాక్స్ డ్రైయిన్ పక్కన నివాసంఉంటున్న పలువురు బుధవారం ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసారు. తామంతా గత 30 సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నామని, అయితే ఇప్పుడు అధికారులు అక్కడ నుంచి వెళ్లి పోవాలని చెబుతున్నారని, తమను ఆదుకోవాలని వారు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే బాక్స్ డ్రెయిన్‌ను పూర్తి చేయడం జరిగిందని, ఎవరు అక్కడ నుంచి ఖాళీ చేయాల్సిన అవసరం లేదని, ఎవరు ఆందో ళనకు గురికావాల్సిన అవసరం లేదని, అధికారులతో మాట్లాడి ఏ ఒక్క నివాసాన్ని తొలగించకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

## అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి


హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని కలిసిన కొత్త కిషోర్ గౌడ్ , కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్, రంగ బ్రహ్మన్న గౌడ్

**బోడుప్పల్ , జూలై 2 ప్రభాతవార్త ;** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్ల చింతలచెరువు కట్టపై అక్రమంగా నిర్మించిన అపార్ట్మెంట్లను తొలగించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను మర్యాదపూర్వకంగా పలువురు కలిసి గతంలో చెరువు కట్టపై అక్రమంగా నిర్మించిన అక్రమ నిర్మాదారుల పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన కమిషనర్ రంగనాథ్ అతి త్వరలోనే కబ్జాదారుల పై చర్యలు తీసుకొని చెరువు పై నిర్మించిన అక్రమాలను తొలగిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్ గౌడ్, చెంగిచెర్ల మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలని వినతి



**మల్కాజిగిరి జూలై2,ప్రభాతవార్త :** సంతోష్ నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల నూతనంగా ఎన్నికైన సంతోష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం సాయి నగర్ లోని కార్పొరేటర్ సునీత యాదవ్ కార్యాలయంలో బీఆర్ఎస్ నేత మేకల రాము యాదవ్ కు కలిసి వినతి పత్రం అందజేశారు. సంతోష్ నగర్ కాలనీలో మంచినీటి సమస్య ఉందని, ఒక పవర్ బోరు మంజూరు చేయాలని, అదేవిధంగా స్పీడ్ బ్రేకర్ లు ఏర్పాటు చేయాలని మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సంతోష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బ్రహ్మయ్య రాము కిట్టు నర్సింగ్ రావు ఉన్నారు